ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 3 మే 2024



చింతలపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి

- ఇది ఉద్యమకారుడికి, మోసగాళ్లకు మధ్య ఎన్నిక
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తొర్రూరు మండలంలో ఎన్నికల ప్రచారం

7లో..

ఎన్నికలలో..

లోక్‌సభ ఎన్నికల వేళ హామీలు గుప్పిస్తున్న నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. తమను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ఇటు అభ్యర్థులు.. అటు ఆయా పార్టీల నేతలు హామీలు గుప్పిస్తున్నారు. ఓరుగల్లు కాకతీయుల ఏలిన మహానగరమే అయినా.. పెరుగుతున్న జనాభాకు అవసరమైన సౌకర్యాలు అంతంతే. రాష్ట్రానికి రెండో రాజధాని అనే మాటే తప్ప హైదరాబాద్‌లో ఉన్న వసతుల్లో పైసా వంతు కూడా ఇక్కడ లేవనే చర్చ ఉంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల వేళ నేతలు, అభ్యర్థులు గుప్పిస్తున్న హామీలను ఓరుగల్లు వాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రజల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లు, ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ప్రచార తీరు, అభ్యర్థుల వాగ్దానాలను గమనిస్తున్న ప్రజలు
- వరంగల్ నగరంలో అండర్ డ్రెయినేజీపై ఆసక్తి
- తెరపైకి మామునూరు విమానాశ్రయం.. ప్రజల్లో గగనయానంపై ఆశలు
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు విస్తరిస్తేనే ఉపాధికి అడుగులు
- భూపాలపల్లి రైల్వేలైన్.. మైనింగ్, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు జరిగేనా?
- కలగానే స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్‌పార్కు, సైనిక్ స్కూల్ ఏర్పాటు
- ఐటీ టవర్లు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుపైనా నేతల హామీలు



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై ఆశలు

'హైదరాబాద్‌కు సముద్రాన్ని, ఓడరేవును తీసుకొస్తా' అంటూ సినిమాల్లో రాజకీయ నేతలు హామీలు ఇవ్వటం చూసి నవ్వుకున్నాం.. కానీ, వరంగల్‌కు మాత్రం ఏ నాయకుడు అలాంటి హామీ ఇవ్వకపోయినా వానాకాలం వస్తే చాలు నగరం మొత్తం ఓ సముద్రమే. నాటు పడవలు, బోట్లు కూడా ఈ సముద్రంలో చక్కర్లు కొడుతాయి. కాకపోతే అవి వరదలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తిరుగుతుంటాయి. దీనికి కారణం నాలాలు, చెరువులు, కుంటలను చివరికి దారులను కూడా కబ్జా చేసి దర్జాగా ఇళ్ల నిర్మాణం చేయటమేనని అభిప్రాయాలున్నాయి. వరంగల్ నగరంలో 10లక్షలకు పైగా జనాభా, 1,500కు పైగా కాలనీలున్నాయి. అయితే నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో లోతట్టు ప్రాంతాలు ప్రతీ ఏటా నీట మునిగిపోవాల్సిందే. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగల్‌గా మారిపోయింది. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో వానాకాలం కష్టాలు తప్పటం లేదు. అయితే ఈ కష్టాలకు కాస్తంత ఊరటనిచ్చేది అండర్ డ్రైనేజీ వ్యవస్థేనని అని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. వరంగల్ నగరం స్మార్ట్ సిటీ కింద ఎంపికైనా నిధులు సక్రమంగా విడుదల కాకపోవటంతో అభివృద్ధికి అడుగులు పడటం లేదు. అన్ని పార్టీలు కూడా అండర్ డ్రెయినేజీపై హామీలు ఇస్తుండటంతో ఓటర్లలో ఆశలు చిగురిస్తున్నాయి.

విమానం ఎగురచ్చునేమో..?

నిజాం కాలంలో రయ్ రయ్ మంటూ ఆకాశంలోకి ఎగిరిన విమానం.. ఇంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరువాత మాత్రం గగనమైపోయింది. 2017లోనే ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసి, విమాన సర్వీసులు నడిపేందుకు ముందుకు వచ్చింది. అయితే హైదరాబాద్ నుంచి 150 కిలో మీటర్ల దూరంలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయవద్దని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాహణ సంస్థ జీఎంఆర్‌తో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి 140కిలో మీటర్ల దూరంలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండటంతో ఆ ఒప్పందం ఆటంకంగా మారుతుంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన మరో సుమారు 504 ఎకరాల భూమి సేకరణ కూడా సమస్యగా మారింది. ఈ రెండు సమస్యలు పరిష్కరిస్తే వరంగల్ నుంచి ఆకాశయానం చేసే చాన్స్ దక్కుతుంది. అంతేకాదు అనేక పరిశ్రమలు, వ్యాపార సంస్థలు వరంగల్ కేంద్రంగా

మిగతా 7వ పేజీలో..

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు గ్రహణం వీడేనా?

వరంగల్‌లో అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్‌కు నిర్మాణం కోసం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట శివారులో 22 అక్టోబరు 2017న భూమి పూజ చేశారు. 1,350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు లభించేవి. అయితే ఏడేళ్లుగా టెక్స్ టైల్ పార్కు నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వంతో 22కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నా కేవలం రెండు కంపెనీలు మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించాయి. అయితే 18 మార్చి 2023న కేంద్రం ప్రభుత్వం పీఎం మిత్ర కింద వరంగల్ టెక్స్‌టైల్ పార్కును ఎంపిక చేసింది. కానీ అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టకపోవటంతో మెగా టెక్స్‌టైల్ పార్కు లక్ష్యం నీరుగారుతుంది. గెలిచే అభ్యర్థి. మెగా టెక్స్‌టైల్ పార్కును గాడిలో పెట్టాలని ఓరుగల్లు వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.




ఎండ వేడిమికి టోపీలు, కర్చీఫ్‌లు ధరించి ప్రయాణిస్తున్న నగరవాసులు

రారెత్తిస్తున్న ఎండలు

46.5 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

- వడగాడ్పులకు అల్లాడుతున్న జనం

హనుమకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్నిగోళంగా మండుతోంది. మండుతున్న ఎండలతో జనం అల్లాడుతున్నారు. భానుడు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత రికార్డుస్థాయిలో 46.5 డిగ్రీలకే చేరింది. ఇది జిల్లా చరిత్రలో ఇది అసాధారణమైన పరిస్థితి. ఎండ తీవ్రతకు వడగాలులు కూడా తోడయ్యాయి. వడగాలుల వల్ల గాలిలో తేమశాతం పూర్తిగా తగ్గిపోయి ఉష్ణోగ్రత దారుణంగా పెరుగుతోంది. గురువారం ములుగు జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీలు నమోదైంది. మహబూబాబాద్‌లో 46.3 డిగ్రీలు, వరంగల్‌లో 46.2 డిగ్రీలు, జనగామలో 45.6 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.5 డిగ్రీలు, హనుమకొండలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో 20 జిల్లాలో 45 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఇందులో ఆరు జిల్లాలో ఉమ్మడి వరంగల్ పరిధిలోనివే. పది రోజులుగా ఆందోళన

మిగతా 8వ పేజీలో..

మోదీతోనే దేశాభివృద్ధి

- కశ్మీర్ ప్రజలకు విముక్తి కల్పించాడు..
- కాంగ్రెస్ హయాంలో మత కల్లోలాలు, కుంభకోణాలు, కర్ఫ్యూలు
- కడియం శ్రీహరి వెన్నుపోటుదారుడు
- బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ స్థానికేతరుడు
- ప్రచారంలో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్



పెగడపల్లి డబ్బాల జంక్షన్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి

హనుమకొండ టౌన్, మే2: భారత దేశం అభివృద్ధి జరగాలంటే మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని, తద్వారా దేశ ప్రజలు సురక్షితంగా ఉంటారని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 5, 6, 51, 52, 53, 54, 57 డివిజన్‌లల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్స్‌లో అరూరి రమేశ్ పాల్గొని మాట్లాడారు. మే 13న జరుగుతున్న ఎన్నిక దేశాన్ని తన పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడే నాయకుడిని ఎన్నుకోవడానికి జరిగేదన్నారు. 50ఏళ్ల కాంగ్రెస్‌పాలనలో కర్ఫ్యూలు, బోఫోర్స్ కుంభకోణం, మతకల్లోలాలు, నిత్యం 144 సెక్షన్‌తో పేదలను విస్మరించిందన్నారు. కానీ మోదీ పదేళ్లలో దేశాన్ని ఎలా అభివృద్ధి చేశారో గమనించాలన్నారు. భారత్‌లో అంతర్భాగమైన కశ్మీర్‌ను కాంగ్రెస్ పట్టించుకోకపోతే అక్కడి ప్రజలు ఎన్ని విధాలుగా ఇబ్బందులు పడ్డారో దేశ ప్రజలం దరికీ తెలుసన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసి అక్కడి ప్రజలకు విముక్తిని కలిగించి స్వేచ్ఛను కల్పించారన్నారు. ఇతర దేశాలు మన దేశం వైపు కన్నెత్తి చూడకుండా దేశ సరిహద్దుల్లో పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేసి దేశ ప్రజలు కంటి నిండా నిద్ర పోయేలా చేశాడన్నారు.

బీసీ కులంలో పుట్టి, చాయ్ అమ్ముకునే పరిస్థితి నుంచి ప్రధానిగా ఎదిగిన మోదీకి పేద ప్రజల కష్టాలు తెలుసని, అందుకే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని అరూరి అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రామమందిర నిర్మాణంలో ఒక్క రక్తం చుక్క కారకుండా ప్రశాంతమైన వాతావరణంలో బలరాముడి ఆలయం నిర్మింపజేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు.

భారత్‌కు చెందిన 25,000 మంది వైద్య విద్యార్థులు ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో చిక్కుకుంటే అక్కడ ప్రభుత్వాలతో మాట్లాడి ఆరు రోజులు యుద్ధం నిలిపివేయించి మన విద్యార్థులను మన దేశానికి తీసుకొచ్చిన ఘనత మోదీకే సాధ్యమైందన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెన్నుపోటుదారుడని, రాజకీయ జన్మనిచ్చిన ఎన్టీఆర్‌తో పాటు చంద్రబాబు, కేసీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చివరికి కాంగ్రెస్‌లో చేరాడన్నారు. అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌లో ఉంటాడన్న నమ్మకం కూడా లేదన్నారు. బీ ఆర్ఎస్ పార్టీలో ఉన్న తనతోపాటు రాజయ్య, దయాకర్‌ను పార్టీని వీడేలా చేసింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. తనంత నిజా యితీపరుడులేడని గొప్పలు చెప్పుకుంటున్న శ్రీహరి. లెక్చరర్‌గా రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చినప్పుడు లేని అద్దాల మేడలు, విల్లాలు, కార్లు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాలని అరూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గుంటూరుకు చెందిన ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకున్నాక మహ్మద్ కావ్య అ వుతుంది కానీ.. కడియం కావ్య ఎలా అవుతుందని ప్రశ్నించారు. కావ్యను గుంటూరువాసిగానే ప్రజలు పరిగణించి చిత్తుగా ఓడిం చాలని అరూరి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి స్థానికేతరుడని, కరీంనగర్ లోక్‌సభ పరిధికి చెందిన వ్యక్తి అన్నారు. మద్యం, మాంసం, డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకుంటే బిడ్డల భవిష్యత్తు నాశనమైతుందన్నారు.

అనేక హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క హామీ అమలుచేయకుండా రాహుల్‌గాంధీ వస్తే అన్నీ అమలవుతాయని అంటోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ ఆగం కావొద్దని, యువత భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. తనకు ఓటు వేసి వరంగల్ ప్రతినిధిగా లోక్‌సభకు పంపిస్తే మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరిస్తానని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని అరూరి రమేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ జంక్షన్‌ల్లోని షాపులకు వెళ్లి అక్కడ పనిచేసే కార్మికులతో పాటు యజమానులను కమలం పువ్వుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, నాయకులు సరోత్తమ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కురిమిండ్ల సదానందం, వాసుదేవరెడ్డి, సత్యనారాణయణ, వివిధ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో పూరీలు కాలుస్తున్న అరూరి

తండాలను పంచాయతీలు చేయడంలో మోదీ కృషి

గిరిజన మోర్చా సమ్మేళనంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి

హనుమకొండ టౌన్, మే1: తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దడంలో ప్రధాని నరేంద్రమోదీ కృషి ఉందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. గురువారం హంటర్‌రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో గిరిజన మోర్చా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి అరూరి హాజరై మాట్లాడారు. తండాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ కేంద్ర మంత్రి అమర్‌సింగ్ తిలావత్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్, పార్లమెంట్ ప్రభారి మురళీధర్ పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు

పర్వతగిరి : మండలంలోని అనంతారం, తూర్పుతండా, రావూరు, మూడెత్తులతండా, ఏనుగల్లు గ్రామాల్లో పలు పార్టీల నుంచి నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా గురువారం వారికి అరూరి రమేష్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, ఏకాంతంగౌడ్, జాటోత్ శ్రీనివాస్‌నాయక్, రంగు కుమార్‌గౌడ్, చీమల భిక్షపతి, బొట్ల మధు, కుడికాల శ్రీధర్, గూడ నరేందర్, రాము, లక్ష్మణ్, యాలాద్రి, దేవేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేశ్

రెడ్డి సామాజిక వర్గంలోనూ పేదలు ఉన్నారు..

- రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అగ్రవర్ణాల పేదలకూ సంక్షేమ ఫలాలు అందాలి
- అవినీతికి కేరాఫ్ అరూరి రమేశ్
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

భీమారం/నయీంనగర్, మే 2: రెడ్డి సామాజిక వర్గంలోనూ నిరుపేదలు ఉన్నారని, వారికి సహాయ, సహకారాలు అందేలా కృషి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. గురువారం హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్ట వద్ద గల కేఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో తెలంగాణ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కృతజ్ఞత సభ జరిగింది. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంఘానికి పూర్తి సహాయ సహకారాలు అంది స్తామన్నారు. వరంగల్‌లోని సంఘం సమస్యలను ప్రభు త్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. రెడ్డి నాయకత్వం బలంగా ఉన్న చోట పార్టీ కూడా బలంగా ఉంటుందన్నారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా కూడా అవినీతికి తావు లేదని శ్రీహరి చెప్పారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని న్యాయం చేశాన న్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు తనపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని శ్రీహరి విమర్శించారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని కడియం పేర్కొన్నారు.

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. అవినీతికి కేరాఫ్ అడ్రస్ వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ అని ఆరోపించారు. రమేశ్‌కు ఓటు వేస్తే భూములు రాసి ఇచ్చినట్లే అన్నారు. రెడ్డి సంక్షేమ సంఘానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే సంఘానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని కావ్య పేర్కొన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు సైతం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాల్సి ఉందన్నారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని కావ్య వెల్లడించారు.



రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



న్యాయవాదులతో సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

బీజేపీవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

దేశంలో బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఆరోపించారు. హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ పార్టీ న్యాయవాదుల పరిచయ సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి డాక్టరు కడియం కావ్య ప్రసంగించారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజాభిప్రాయానికి అనుగుణమైన పాలన జరగాల్సి ఉండగా, బీజేపీ ఇందుకు వ్యతిరేకంగా నియంత పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ తదితర నిఘా సంస్థలను అడ్డు పెట్టుకొని బెదిరింపులకు గురి చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర పనుతున్న బీజేపీని మళ్లీ అధికారంలోకి తెస్తే దేశానికి పెను ప్రమాదమేనన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీని గద్దె దించాలని కోరారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సెల్ లీగల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్, ఏఐసీసీ లీగల్ సెల్ కో-ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, మెంబర్స్ మహాత్మా, జగన్మోహన్‌రెడ్డి, వరంగల్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ముదశిర్, హనుమకొండ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి ఆడబిడ్డ కావ్య

- ఎంపీగా గెలిపిస్తే మండలాన్ని దత్తత తీసుకుంటుంది
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పర్వతగిరి, మే 2: పర్వతగిరి ప్రజల ఇంటి ఆడబిడ్డ కడియం కావ్య అని, ఆమెను ఆశీర్వదించి పార్లమెంటుకు పంపిస్తే పర్వతగిరి మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేఆర్ఆర్ గార్డెన్స్‌లో బూత్ లెవల్ కమిటీ, మండల విస్తృతస్థాయి కమిటీల సమావేశాలను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ తాను ఈ మట్టిలో పుట్టానని, ఈ గడ్డమీదే పెరిగానని, పర్వతగిరి మండలంతో తనకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. కానీకొందరు తమది పర్వతగిరి కాదని ఆరోపిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. 1968లో పర్వతగిరిలో అత్యధిక మార్కులతో పదవ తరగతి పాసయ్యింది తానొక్కడినేనని, చదువురాని, వినిపించి, వినిపించని వాళ్లు తనను విమర్శిస్తున్నారన్నారు. పర్వతగిరి పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చానని, తాను చదువుకున్న బడిని మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేశానన్నారు. పర్వతగిరికి నాలుగు వైపులా డబుల్‌లైన్ బీటీ రోడ్లు వేయించానని, ఎర్రబెల్లి దయాకర్‌రావు, అరూరి రమేష్‌లు పదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని కడియం ప్రశ్నించారు. అరూరి రమేష్ మండలానికి ఒక గెస్ట్‌హౌస్ కట్టుకుని భూ దందాలు చేశాడని, పనులు తాను చేస్తే పేరు వాళ్లు చెప్పుకునేదని, నిధులు తాను తెస్తే కమీషన్లు వాళ్లు తీసుకునేదని విమర్శించారు. పర్వతగిరి ప్రజల గౌరవం పెంచేలా పని చేశాను కానీ, ఎన్నడూ తల దించుకునే పనిచేయలేదన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆరూరి రమేష్‌ల మూతి మీద తన్నినట్లు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ బొంపెల్లి దేవేంద ర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జడ్పీటీసీ బానోత్ సింగులాల్, నాయకులు వెంకట్‌రెడ్డి, రథన్‌రావు, దేవేందర్, చలపతిరావు, రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి సమావేశంలో విల్లు ఎక్కుపెట్టిన కావ్య

పర్వతగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..: కావ్య

వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ తన స్వగ్రామం పర్వతగిరి అని, ఎంపీగా గెలిపిస్తే మండలాన్ని దత్తత తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సుస్మిత బతికే ఉందా?

- ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిందని పోలీసుల సమాచారం
- మృతదేహంపై ఆనవాళ్లు లేవన్న తండ్రి, బాబాయి
- బతికే ఉంటుందని కుటుంబ సభ్యుల ఆశాభావం


తిక్క సుస్మిత (ఫైల్)

హసన్‌పర్తి, మే 2 : చత్తీస్‌గఢ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మందిలో 8 మందిని పోలీసులు గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలుగువారుగా గుర్తించారు. ఈ ముగ్గురిలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క సుస్మిత(26) అలియాస్ చైతేగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు చత్తీస్‌గఢ్ పోలీసులు సుస్మిత కుటుంబసభ్యులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతదేహాన్ని నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. సుస్మిత తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్ హుటాహుటిన బుధవారం సాయంత్రం చత్తీస్‌గఢ్‌కు బయలుదేరారు. వారు మృతదేహాన్ని చూసి తమ కూతురు సుస్మిత కాదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అక్కడి నుంచి సమాచారాన్ని సూదన్‌పల్లిలోని కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో బంధువులతో పాటు గ్రామస్తులు కూడా సంతోషించారు.

సుస్మితను గుర్తింపునకు ఆనవాళ్లు

సుస్మితకు చిన్నప్పుడు ఫిట్స్ వచ్చేదని బంధువులు, గ్రామస్తులు తెలిపారు. ఫిట్స్‌ను నయంచేయడానికి సుస్మితకు తలకు ఇరువైపులా, నుదుటిపై రూపాయి బిల్ల వెడల్పుతో కాల్చిన గుర్తులు మూడు ఉండేవని చెప్పారు. ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాన్ని చూసి మృతదేహం సుస్మితది కాదని తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్ నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని వెంటనే తమ కుటుంబసభ్యులకు తెలిపారు. తర్వాత నుంచి వారి ఫోన్ పనిచేయడం లేదని బంధువులు వాపోతున్నారు. చత్తీస్‌గఢ్‌కు వెళ్లి వచ్చినవారు చెబితే గాని నిజాలు తెలుస్తాయని కుటుంబసభ్యులు, గ్రామస్తులు అంటున్నారు.

ఉద్యమ ప్రస్థానం

హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లికి చెందిన తిక్క సుధాకర్-సరోజన దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. వృత్తి వ్యవసాయం. సుధాకర్, అతడి తమ్ముడు తిక్క దేవేందర్‌లు మావోయిస్ట్ సానుభూతిపరులు. మొదటి కూతురు సుస్మిత ఇంటర్ చదివి పీపుల్స్‌వార్‌కు ఆకర్షితురాలై 2014లో ఉద్యమ బాట పట్టింది. కుటుంబసభ్యులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇప్పించి జనజీవన స్రవంతిలో కలవాలని పలుమార్లు తల్లిదండ్రుల ద్వారా లొంగిపోయేందుకు ప్రయత్నించారు. ఎంతకీ సమాచారం తెలియరాలేదు. దండకారణ్యంలో అంచెలంచెలుగా ఎదిగిన సుస్మితపై రూ.2లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో సుస్మిత మరణించిన విషయం కుటుంబ సభ్యులు ధ్రువీకరిస్తేగాని అసలు విషయం తెలుస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాజీపేట, మే 2: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్‌ఎదుట పార్సిల్ ఆఫీస్ వద్ద గత నెల 29న గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వయస్సు 40-50 సంవత్సరాలు, ఎత్తు 5.5. పొడువైన నలుపు ముఖం, చినిగిపోయిన బట్టలు ధరించి ఉన్నాడు. స్థానికులు సమాచారం మేరకు 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎంతరలించారు. చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి ఆనవాళ్లను బట్టిచూస్తే యాచకుడిగా భావిస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 8712685008, 8712685122, నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని కాజీపేట పోలీసులు తెలిపారు.

నకిలీ క్లినిక్‌పై వైద్య మండలి తనిఖీ


తనిఖీ చేస్తున్న వైద్య మండలి సభ్యులు

వరంగల్ మెడికల్ మే 2 : ఇటీవల వర్ధన్నపేటలో నకిలీ వైద్యుడు ఆడెపు శ్రీనివాస్ తెలియని వైద్యం చేయడంవల్ల మృతి చెందిన కత్తి నవీన్ సంఘటనను సుమోటోగా స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులు, వరంగల్ యాంటీ క్వికరీ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు నకిలీ వైద్యుడి క్లినిక్‌ను గురువారం సందర్శించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విద్యార్హత లేకుండా తెలిసీ తెలియని వైద్యం చేయడం వల్లే నిండుప్రాణం బలైందని తెలిపారు. జరిగిన సంఘటన ఆధారంగా సమగ్ర నివేదిక తయారు చేసి హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలికి పంపనున్నట్లు విచారణ కమిటీ సభ్యులు తెలిపారు. విచారణ కమిటీలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్, ఐఎంఏ వరంగల్ అధ్యక్షులు డాక్టర్ అన్వర్‌మియా, ఉపాధ్యక్షుడు డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

హనుమకొండ టౌన్, మే 2 : మనుమకొండ మచిలీబజార్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి అన్వర్ అదృశ్యమయ్యాడు. ఎం.డి. అన్వర్ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మూడు సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. దీంతో అన్వర్ ఈ నెల 29న రాత్రి 8 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికిన సమాచారం లేకపోవడంతో విద్యార్థి తండ్రి ఇంతియాజ్ అహ్మద్ గురువారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ములుగు నుంచి ముగ్గురు ఎంపీలు

- పల్లె నుంచి పార్లమెంటుకు..
- ఢిల్లీలో మెరిసిన గిరిజన బిడ్డలు


చందూలాల్


బలరాంనాయక్


సీతారాంనాయక్

ములుగు, మే 2 : భౌగోళికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ములుగు ప్రాంతం రాజకీయ రంగంతో తనదైన ముద్ర వేసుకున్నది. ఇక్కడి మారుమూల పల్లెల నుంచి ఢిల్లీ వరకు నేతలుగా ఎదిగిన పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రాష్ట్ర, కేంద్రమంత్రులుగా మెరిశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాటి, నేటి నేతల ప్రస్థానాన్ని, ములుగు రాజకీయ ముఖచిత్రాన్ని ప్రజలు నెమరువేసుకుంటున్నారు.

ముగ్గురు ఎంపీలూ లంబాడాలే..

ములుగు ప్రాంతం నుంచి ఇప్పటివరకు ముగ్గురు ఎంపీలుగా ఎన్నికై పార్లమెంటులో సత్తా చాటారు. వీరంతా లంబాడా సామాజికవర్గానికి చెందినవారు కావడం గమనార్హం. ఇక్కడ ఆదివాసీల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయంగా లంబాడీలకే అవకాశాలు వచ్చాయి. ములుగు మండలం జగ్గన్నపేట పంచాయతీ పరిధి సారంగపల్లెకు చెందిన అజ్మీరా చందూలాల్ 1996లో టీడీపీ తరుపున పోటీచేసి వరంగల్ ఎంపీగా ఎన్నికయ్యారు. అప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1998 ఎన్నికల్లో కూడా ఆయన ఎంపీగా గెలిచారు. పదకొండేళ్ల విరామం తర్వాత 2009లో పోరిక బలరాంనాయక్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయనది ములుగు మండలం మదనపల్లి. లోక్‌సభ పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడ్డ మహబూబాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. సోషల్ జస్టిస్, ఎంపవర్మెంట్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) అభ్యర్థిగా బరిలో నిలిచిన వెంకటాపూర్(రామప్ప) మండలం మల్లయ్యపల్లికి చెందిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ ఎంపీగా విజయం సాధించారు.

తొలి ప్రయత్నంలోనే విజయతీరాలకు..

ఈ ముగ్గురు నేతలూ తొలి ప్రయత్నంలోనే విజయాలనందుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అసెంబ్లీలో తనదైన ముద్రవేసుకొని రాజకీయ అనుభవం కలిగిన చందూలాల్‌కు జనరల్ స్థానమైన వరంగల్ నుంచి పోటీచేసే అవకాశం యాదృచ్ఛికంగా వచ్చినప్పటికీ మహబూబాబాద్, నర్సంపేట, ములుగు డివిజన్‌లలోని గిరిజన ఓటర్లను ప్రభావితం చేయడంలో సక్సెస్ అయ్యారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన తొలి గిరిజనుడిగా గుర్తింపు పొందారు. ఇదే తరహాలో 2009లో గెలిచిన బలరాంనాయక్ కూడా పోటీచేసిన మొదటి ఎన్నికలోనే విజయం సాధించి ఏకంగా కేంద్రమంత్రి అయ్యారు. 2014లో ఎంపీగా ఎన్నికైన సీతారాంనాయక్‌కు సైతం అదే తొలి ఎన్నిక. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, తెలంగాణ ఉద్యమకారుడిగా సుపరిచితుడైన ఆయన పార్లమెంటు సభ్యుడిగా తనదైన పాత్ర పోషించారు.

ఈసారి బరిలో ఇద్దరు..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో మహబూబాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థిగా సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. వీరిలో ఎవరు గెలిచినా ఐదోసారి ములుగు ప్రాంత నేతకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కినట్లవుతుంది. ఈనేపథ్యంలో జిల్లావాసులు మే 13నాటి ఎన్నికలు, తర్వాత వెలువడే ఫలితాలపై అమితాసక్తిని కనబర్చుతున్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

వరంగల్ కలెక్టరేట్, మే 2: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ఫిర్యాదుల కోసం మొబైల్ నెంబర్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులను ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ మొబైల్ నెంబర్ 82475 24267కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. లేదా కాజీపేట నిట్‌లోని అబ్దుల్ కలాం గెస్ట్‌హౌస్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నేరుగా కలిసి ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని ప్రకటనలో తెలిపారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి : కలెక్టర్


5కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

వరంగల్ కలెక్టరేట్, మే 2 : ఈ నెల 5న నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో 5కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగంచుకునేలా చైతన్య పరిచేందుకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కే రన్‌లో విద్యార్థులు, యువత, మహిళలు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తొర్రూరు మండలంలో ఎన్నికల ప్రచారం


వెల్లికట్టెలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, మే 2: అబద్ధాలతో గద్దె నెక్కిన కాంగ్రెస్‌ను, పేద ప్రజలపై భారం మోపుతున్న బీజేపీలను ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోసం ఎర్రబెల్లితో పాటు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తొర్రూరు మండలంలోని నాంచారిమడూరు, వెలికట్టె, చింతలపల్లి, గుర్తూర్, ఫత్తేపురం, చెర్లపాలెం, మాటేడు, హరిపిరాల, వెంకటాపురం శివారు తండాలు, గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వెల్లికట్టెలో ఈజీఎస్ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదని, బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు.

అనంతరం ఆయా గ్రామాల్లో కార్యకర్తలు, ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కనీసం తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ఉన్నారు. అతి తక్కువ రోజుల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నందున కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీఆర్ఎస్ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు మార్పు కోరుతూ ఒక ఓటు వేస్తే ఇద్దరు ఎమ్మెల్యేలు వచ్చారని, ఇది ఎక్కడా లేని విధంగా ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ తప్పిదాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుడికి, మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి నిలదీసే మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ రాగానే కరువు, కష్టాలు, కరెంట్ కోతలు మళ్లీ మొదలైనట్లు వివరించారు.

ప్రజల ప్రయోజనాల కోసం పాటుపడుతాం..

పదేళ్ల అధికారంలో ఉండి దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేశామని, అధికారం లేకపోయిన ప్రతిపక్షంలో ఉండి ప్రజల ప్రయోజనాలకోసం పాటుపడుతామని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. తొర్రూరు మండలంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగేవిధంగా చూస్తామని, సంక్షేమపథకాలు ప్రజలకు అందకుంటే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. నమ్మించి మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో శాశ్వతంగా రాజకీయంగా రాజకీయ సమాధి చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పేదల నడ్డివిరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అనంతరం అమ్మాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిన్నెర నగేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ప్రమోద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పోసాని రాములు, సంతోష్, దేవేందర్‌రావు, పాపిరెడ్డి, మేరుగుప్రకాష్, రమేష్, కుమార్, జాటోతు రమేష్, కాలునాయక్, కొండవెంకన్న, మురళి, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటాం..

- పార్టీని కాపాడుకోవడంలో లీగల్ టీం తోడ్పాటునందిస్తుంది
- బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్


మాట్లాడుతున్న భరత్‌కుమార్

రాంనగర్, మే 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్ఎస్ శ్రేణులపై మోపే అక్రమ కేసులను లీగల్ సెల్ ద్వారా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సోమా భరత్‌కుమార్ భరోసా ఇచ్చారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అడ్వకేట్ జనార్ధన్‌గౌడ్ అధ్యక్షతన బీఆర్ఎస్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొట్లాడిన అనేక సంఘాల్లో లాయర్ల జేఏసీ అగ్ర స్థానంలో ఉందన్నారు. ఉద్యమ స్థానంలో ఢిల్లీలో సైతం లాయర్ల జేఏసీ కొట్లాడిందన్నారు. ఉద్యమకారులపై పెట్టిన కేసుల విషయంలో లాయర్లు సొంతంగా ఖర్చులు పెట్టి విడిపించారని భరత్‌కుమార్ గుర్తు చేశారు. న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు బడ్జెట్‌లో కేసీఆర్ నిధులు కేటాయించారని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. పార్టీకి అనుబంధంగా ఉంటూ సేవలందిస్తున్న న్యాయవాదులకు రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదులు తన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌లో అనేక రకాలుగా లబ్దిపొంది స్వలాభం కోసం పార్టీని వీడినవారు తన ప్రత్యర్థులని ఆయన తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు తగు బుద్ధి చెపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కుడా మాజీ చైర్మన్‌లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశం ప్రారంభంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీని రాష్ట్ర అధ్యక్షులు భరత్‌కుమార్ ప్రకటించారు.

హనుమకొండ, వరంగల్ జిల్లా నూతన కమిటీ

అధ్యక్షుడిగా గుర్రాల వినోద్, ఉపాధ్యక్షులు శ్రీరాం కిరణ్‌కుమార్, నాయిని రవి, వసంత్‌యాదవ్, వేణు పటేల్, ఎంకే అంబేద్కర్, అంజయ్యగౌడ్, అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శి జి.శివరాజ్, కోశాధికారి పి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు పి.బస్వరాజ్, శ్రీరామ్ నాయక్, మహేష్ పటేల్, నవీన్‌కుమార్, రాంప్రసాద్, అరుణ, కమిటీ సభ్యులు సమ్మిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, సంపత్, జాఘువా, ఉషా, రాజు, చంద్ పాషా, మల్లేశం, గౌరవ సలహాదారులు ఎం.సహోదర్‌రెడ్డి, జనార్ధన్‌గౌడ్, గణేష్, శ్యామ్‌సుందర్‌రావు, సోమేశ్వర్‌రావు, బాల కిషన్‌రావు, రంజిత్, భద్రయ్య, శ్రీనివాస్‌రావు.

స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన



ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్ మే 2: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం లష్కర్ సింగారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు, సిబ్బందితో కలిసి ఓటరు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మయ్యనగర్ మీదుగా 100 ఫీట్ల రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విధిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, సీహెచ్ఓ టి.మాధవరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రవీందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు షురూ

- తొలిరోజు ముగ్గురు అభ్యర్థుల నామినేషన్
- నేడు దాఖలు చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - నల్లగొండ)

శాసనమండలి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల స్థానానికి జరగబోయే ఉపఎన్నికకు నామినేషన్ల ఘట్టం మొదలైంది. ఈ ఎన్నికకు సంబంధించి నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈనెల 9వరకు నామినేషన్ల దాఖలుకు గడువుండగా.. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేస్తారన్నదానిపై ఉత్కంఠ కనిపిస్తోంది. మూడు ఉమ్మడిజిల్లాల్లోని మొత్తం 12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో పోటీకి ఆయా పార్టీల మద్దతు కోరుతూ కీలకనేతలు ప్రయత్నాలు చేస్తుండడంతో అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందనేని ఆసక్తిని రేపుతోంది. ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనుండగా.. పదో తేదీన పరిశీలన జరగనుంది. 13న ఉపసంహరణకు చివరి రోజు. కాగా.. 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత వచ్చే నెల 5వ తేదీన పట్టభద్రుల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు నిర్వహించగనున్నారు.

తొలిరోజు నామినేషన్ వేసింది వీరే..

స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్, ప్రజావాణి పార్టీ తరపున పాటి శ్రీకాంత్‌రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

నేడు తీన్మార్ మల్లన్న నామినేషన్

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో ఆయన నామినేషన్ దాఖలు చేయనుండగా ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా ఆ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎన్ని‘కలలో’..

(5వ పేజీ తరువాయి)

కార్యకలాపాలు ప్రారంభించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే అవకాశాలున్నాయి. విమానాశ్రయంపై అన్ని పార్టీలు హామీలు ఇస్తుండటంతో గగనయానంపై ఓరుగల్లువాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

భూపాలపల్లికి రైల్వేలైన్ వచ్చేనా..?

పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లికి రైల్వేలైన్ కలగానే మిగిలింది. 1998 నుంచి భూపాలపల్లి రైల్వేలైన్ డిమాండ్ తెరపైకి రాగా.. పలుమార్లు సర్వేలు నిర్వహించినా రైల్వేలైన్‌కు మోక్షం లభించలేదు. అయితే 2022-23 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కాజీపేట- భూపాలపల్లి మధ్య 64కి.మీ నిర్మించే రైల్వే లైన్‌కు ఫైనల్ లోకేషన్ సర్వే కోసం రూ.1,152కోట్లు కేటాయించింది. అలాగే రామగుండం వయా భూపాలపల్లి టు మణుగూరుకు 198కిలో మీటర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం రూ.3,600కోట్లు కేటాయించారు. అయితే కొంత వరకు సర్వే చేసి అధికారులు వదిలేశారు. దీంతో భూపాలపల్లి రైల్వేలైన్ కలగానే మిగులుతుందా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎంపీగా గెలిచే అభ్యర్థి రైల్వేలైన్‌కోసం కృషి చేయాలని ఓటర్లు కోరుతున్నారు. దీంతోభూపాలపల్లి నుంచి కాజీపేట వరకు ప్రయాణంతో పాటు పారిశ్రామికంగా భూపాలపల్లి మరింత అభివృద్ధి చెందేందుకు పరిశ్రమలువచ్చే అవకాశముందనే అభిప్రాయాలున్నాయి.

నెరవేరని లెదర్ పార్కు కల..

చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లి లెదర్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ ప్రభుత్వ హయంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఇందుకోసం తొలి విడతలో స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారిపై చెన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికి ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ప్రస్తుతం పోటీ చేస్తున్న అభ్యర్థులు స్టేషన్‌ఘనపూర్‌తో సంబంధాలున్న నేతలే కావడంతో గెలిచిన వెంటనే లెదర్ పార్కును పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. వెయ్యి కుటుంబాలకు పైగా లెదర్ పార్కుతో ఉపాధి లభించే అవకాశాలున్నాయి.

అగమ్యగోచరంగా సైనిక్ స్కూల్ పరిస్థితి


కేంద్ర ప్రభుత్వం 2016లో వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా పునాదులు కూడా పడటం లేదు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన భూమి, భవనాల నిర్మాణం, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ.కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ఇక్కడ 229 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో 50 ఎకరాలను సైనిక్ స్కూల్‌కు కేటాయించాలని అధికారులు ప్రయత్నించారు. ఆ భూములను తీసుకుని రైతులకు పరిహారం ఇస్తామని అధికారులు చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. భూ కేటాయింపుల నిర్లక్ష్యంతో వరంగల్‌కు వచ్చిన సైనిక్ స్కూల్ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలిపోయే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై రాజకీయ పార్టీలు దృష్టిసారించి వరంగల్ సైనిక్ స్కూల్‌కు మోక్షం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


మరికొన్ని అభివృద్ధి పనులు, సమస్యలు


- మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా కేంద్రం నుంచి తీసుకురావాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.
- వరంగల్ మహానగరంలో ఐటీ టవర్స్‌ను తీసుకరావటం తో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని వరంగల్‌వాసులు ఆకాంక్షిస్తున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిం చేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
- భూపాలపల్లిలో సింగరేణి కార్మికులు అత్యధికంగా ఉండటంతో ఇక్కడ మైనింగ్ విద్యాలయంతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు కూడా చొరవ చూపాలన్న డిమాండ్ ఉంది.
- జనగామ నుంచి పాలకుర్తి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లే సుమారు 110కి.మీ రోడ్డును విస్తరించి నాలుగు లైన్ల రోడ్డు ను అభివృద్ధి చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.
- వర్ధన్నపేటలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనం నిర్మిం చాలని స్థానికులు విన్నవిస్తున్నారు.
- స్టేషన్‌ఘనపూర్‌ను మునిసిపాలిటీగా మార్చాలని. 30పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్‌చేయాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఆమె’కు ఏదీ స్థానం?

- వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం కరువు
- ఆరు దశాబ్దాల్లో ఈ రెండింటిలో గెలిచింది ఇద్దరే..
- ఈ సారి ఎన్నికల్లో బరిలో ఇద్దరు మహిళా నేతలు
- వరంగల్ లోక్‌సభ నుంచి కావ్య, మానుకోట నుంచి కవిత
- గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం


డాక్టర్ కల్పనాదేవి


మాలోతు కవిత


కడియం కావ్య

హనుమకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో ఆరు దశాబ్దాల కాలంలో మహిళల ప్రాతినిధ్యం ఆశించినంతగా పెరగలేదు. ఒకటి ఎస్సీకి, మరొకటి ఎస్టీకి రిజర్వు అయిన ఈ రెండు నియోజకవర్గాల్లో జరిగిన ప్రతీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పురుష అభ్యర్థులను నిలబెట్టడానికే ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీల సంస్థాగత నిర్మాణంలో, బలోపేతం కావడంలో గానీ క్రియాశీల భూమిక పోషించే వారిలో మహిళా నేతలు ఉన్నప్పటికీ వారికి ఎన్నికల్లో ఆశించిన ప్రాతినిధ్యాన్ని ప్రధాన పార్టీలు కల్పించలేకపోయాయి. నియోజకవర్గాల్లో పురుషులతో సమానంగా లేదా అంతకన్నా ఎక్కువ సంఖ్యలో మహిళా ఓటర్లున్నా.. వారిని పార్టీలు పట్టించుకోవడం లేదు. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 60ఏళ్లలో ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు మాత్రమే లోక్‌సభలో అడుగుపెట్టడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఒకప్పుడు మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఉన్న భద్రాచలం ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గం ఇందుకు భిన్నంగా ముగ్గురు మహిళలు ఏడుసార్లు గెలిచారు.

వరంగల్ లోక్‌సభ నుంచి..

వరంగల్ లోక్‌సభ స్థానానికి 1952 నుంచి రెండు ఉప ఎన్నికలు కలుపుకొని 20సార్లు ఎన్నికలు జరిగినప్పటికీ మహిళకు ఒక్కసారి మాత్రమే పోటీకి అవకాశం లభించింది. 1984 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ పక్షాన డాక్టర్ టి.కల్పనాదేవి పోటీ చేశారు. విద్యావంతులు, డాక్టర్, టీచర్ వంటి వృత్తుల్లో ఉన్నవారు రాజకీయాల్లో రావాలని ఎన్‌టీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆమె టీడీపీలో చేరారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో నిలిచే అవకాశం లభించింది. 1984 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కమాలొద్దిన్ అహ్మద్‌పై డాక్టర్ టి.కల్పనాదేవి 8,456 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అలా ఆమె వరంగల్ నుంచి లోక్‌సభలో అడుగుపెట్టిన తొలిమహిళగా నిలిచారు. ఆ తర్వాత 1989 ఎన్నికల్లో టీడీపీ నుంచి రెండోసారి పోటీ చేసినప్పటికీ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం సురేందర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. తదనంతర కాలంలో చోటుచేసుకున్న రాజకీయపరిణామాల నేపథ్యంలో డాక్టర్ కల్పనాదేవి కాంగ్రెస్‌లో చేరారు. 1998, 1999 ఎన్నికల్లో రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. ఆతర్వాత కాలంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలేవి మహిళలకు టికెట్లు ఇవ్వలేదు.

హనుమకొండ నుంచి నిల్..

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రద్దయిన హనుమకొండ లోక్‌సభ స్థానం నుంచి ఒక్క మహిళ కూడా పార్లమెంట్‌లో అడుగుపెట్టలేదు.1977లో ఆవిర్భవించిన హనుమకొండ లోక్‌సభ స్థానం 2009లో రద్దయింది. ఈ మధ్యలో జరిగిన ఎన్నికల్లో 2008 ఉపఎన్నికల్లో తప్ప మిగతా ఏ ఎన్నికల్లో ప్రధానపార్టీలు పోటీకి మహిళలకు అవకాశం ఇవ్వలేదు. 2008 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొండా సురేఖ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో ఆమె గెలువలేకపోయారు. టీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ 55వేల ఓట్ల మెజారిటీతో సురేఖపై విజయం సాధించారు.

మహిళా ఓటర్లే అధికం

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అయినా వారికి పోటీకి తగిన ప్రాతినిధ్యం లభించడం లేదు. గెలుపోటములను నిర్ణయించే స్థితిలో ఉన్నప్పటికీ వీరికి తగిన గుర్తింపు లభించడం లేదు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 36,298 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 7,46,982 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 8,91,940 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 9,24208 మంది ఉన్నారు. అంటే 32,268 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

మహబూబాబాద్ నుంచి ఒకసారి..

ఉప ఎన్నికతో కలుపుకొని ఆరుసార్లు ఎన్నికలు జరిగిన మహబూబాబాద్ ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి లోక్‌సభ అడుగుపెట్టడానికి ఒక మహిళకు మాత్రమే అవకాశం దక్కింది. 2019 ఎన్నికల్లో సీనియర్ నేత ఎస్ రెడ్యానాయక్ కూతురు మాలోతు కవితను టీఆర్ఎస్ తన అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ ఎన్నికల్లో కవిత కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌పై గెలుపొందారు. ఈఎన్నికల్లో కవితకు 4.62 లక్షల ఓట్లు వచ్చాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ సిట్టింగ్ ఎంపీగా కవితకే టికెట్ ఇవ్వడంతో రెండో సారి పోటీ చేసేందుకు ఆమెకు అవకాశం లభించింది.

ఈసారి ఎన్నికల్లో..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో వరంగల్, మహబూబాబాద్ స్థానాల నుంచి ఇద్దరు మహిళలో పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు రాజకీయాలకు కొత్త. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత రెండోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా, వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి సీనియర్ నేత కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కావ్యకు మొదట బీఆర్ఎస్ నుంచి పోటీకి టికెట్ లభించినప్పటికీ మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో గెలుపోటములకుగల అవకాశాలను బేరీజు వేసుకొని చివరి నిమిషంలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ లో చేరి గెలుపు కోసం హోరాహోరీగా పోరాటం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ నుంచి ఇద్దరు మహిళలు బరిలో ఉండడం ఉమ్మడి వరంగల్ రాజకీయ చరిత్రలో ఇదే మొదటి సారి.

విస్తృతంగా ప్రచారం

ఈ ఇద్దరు మహిళా అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు దీటుగా త్రీవస్థాయిలో పోటీ పడుతున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయక ఓటర్లను కలుపుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ ఇద్దరు మహిళా అభ్యర్థుల పోటీలో సారూప్యత ఉంది. మాలోతు కవిత రాజకీయాల్లోకి రావడానికి ఆమె తండ్రి సీనియర్ నేత, మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ ప్రోత్సాహం ఉన్నట్టే కడియం కావ్య మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా రాజకీయాల్లో అడుగుపెట్టడానికి ఆమె తండ్రి మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రోద్బలం ఉంది. ఈ ఎన్నికల్లో ఈ ఇద్దరి పోటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వీరికి ఓటర్ల మద్దతు ఏ మేరకు ఉన్నదనేది ఎన్నికల ఫలితాల తర్వాతగానీ తెలియరాదు. మాలోతు కవిత రెండోసారి తిరిగి విజయం సాధిస్తుందా, మొదటిసారి పోటీ చేస్తున్న కావ్యను గెలుపు వరిస్తుందా? అన్నదానిపై ఓటర్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

భద్రాచలంలో ముగ్గురు..

1965లో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం రద్దయి ఆ స్థానంలో 1967లో మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ భాగంగా ఏర్పడిన భద్రాచలం ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గంలో ఇందుకు భిన్నంగా ఐదుగురి మహిళలకు పోటీ చేసే అవకాశం లభించింది. వీరిలో ముగ్గురు మహిళలు ఏడుసార్లు గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి బి.రాధాబాయి ఆనందరావు నాలుగు సార్లు, కె.కమలకుమారి రెండు సార్లు, దుంపా మేరీ విజయకుమారి ఒకసారి గెలుపొంది తమ సత్తా చాటారు. 1967, 1971, 1977, 1980 ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్ పక్షాన పోటీ చేసి సీపీఎం, సీపీఐ బీఎల్‌డీ అభ్యర్థులపై విజయం సాధించారు. ఆ తర్వాత 1984 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి సోడే రామయ్య చేతిలో ఆమె ఓడిపోయారు. 1989, 1991 ఎన్నికల్లో వరుసగా రెండోసారి కె.కమలకుమారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఆతర్వాత 1996, 1998 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ గెలువలేకపోయారు. 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా దుంపా మేరీ విజయకుమారి కాంగ్రెస్ అభ్యర్థి టి.రత్నాబాయిపై గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కేపీఆర్‌కే ఫణీశ్వరమ్మకు కూడా పోటీ చేసే అవకాశం వచ్చింది. కానీ విజయం సాధించలేకపోయారు.





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆదాయ పన్ను అధికారి చక్రధర్

చలివేంద్రం ఏర్పాటు

గిర్మాజీపేట, ఏప్రిల్ 2 : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా వరంగల్ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని జేపీఎన్ రోడ్ భారత్ పెట్రోల్ పంపు ఎదురుగా గురువారం చలివేంద్రాన్ని ఆదాయ పన్నుశాఖ వరంగల్ ఇన్‌స్పెక్టర్ జి.చక్రధర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. వరంగల్ శాఖ చైర్మన్ సీ.ఎ. భగవాన్‌దాస్ మాట్లాడారు. సీఏ విద్యార్థి అసోసియేషన్ చైర్మన్ సీఏ ఎం. రామకృష్ణ, దరహాస్, రమేష్, పాల్గొన్నారు.

అతివలకు అండ

• ఆకతాయిల ఆట కట్టిస్తున్న షీ టీమ్స్ • నగరంలో పోకిరీల చేష్టలపై నిరంతర నిఘా

మట్టెవాడ, మే 2: అతివలకు అండగా షీ టీమ్స్ నిలుస్తోంది. మహిళలు, యువతులను వేధిస్తున్న ఆకతాయి ఆటకట్టిస్తోంది. నగరంలో భౌతికంగా సా మాజిక మాధ్యమాల ద్వారా మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధిం పులను, రైళ్లల్లో, బస్సుల్లో, బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో, రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీ టీమ్స్ బృందాలు మఫ్టీలో ఉంటూ పోకిరీల పనిపడుతోంది. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించేవారిని పసిగట్టి ప్రత్యేక నిఘా పెట్టి షీ టీమ్స్ బృందాలు వారిని పట్టుకుంటున్నారు. తర్వాత తల్లిదండ్రుల ముందు వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం, పెట్టికేసులు నమోదు చేస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి ఎఫ్ఐఆర్‌ను సైతం నమోదు చేస్తున్నారు.

నగరంలో మూడు షీ టీమ్ బృందాలు..

పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగినులు, మార్కెట్ వెళ్లే గృహిణులు ఇలా నిత్యం నగరంలో వేలాది మంది తమ పనుల్లో నిమగ్నమవుతుంటారు. వీరి భద్రత కోసం సీసీ టీవీ కెమెరాలు, షీ టీమ్ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లు, బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, దేవాలయాలు, పార్కులు తదితర ప్రాంతాల్లో మఫ్టీలోని షీటీమ్స్ నిఘా కళ్లు పోకిరీలను వెంటాడుతున్నాయి. వరంగల్ నగర పరిధిలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో మూడు బృం దాలు మఫ్టీలో నిత్యం గస్తీ కాస్తున్నాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో మఫ్టీలో బృందాలు ఆకతాయిల చేష్టలను దూరంగా ఉండి వీడియో రికార్డింగ్ చేస్తున్నాయి. మీసాలు రాని కొందరు కుర్రాళ్లు యువతులను వేధిస్తున్నారు. పనిచేస్తున్న చోట సహ ఉద్యోగినిని పాలో అవుతూ పురుష లు వేధిస్తున్నవారూ ఉన్నారు. వయసు మళ్లిన వారు కూడా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం బాధాకరం.

అవగాహన కార్యక్రమాలు..

మహిళలను వేధిస్తున్న బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడే యువతులు, విద్యార్థినులకు షీ టీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో బాధితులు తమ ఇబ్బందులను షీ టీమ్స్ పోలీసుల దృష్టికి తీసుకొస్తున్నారు. వరంగల్ నగర పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, సోషల్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- కేసుల వివరాలు..

- నగరంలో 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు షీ టీమ్స్‌కు 284 పిటిషన్స్ వచ్చాయి. ఇందులో 81 పిటిషన్లు కొన్ని తప్పుగా కొంత మంది రాజీపడి పిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. 144 పెట్టి కేసులు నమోదు చేశారు. 31 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. 28 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 235 అవగాహన సదస్సులు నిర్వహించారు.



షీ టీమ్స్ పోలీస్‌స్టేషన్

నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు..

- కోడూరి సుజాత, ఇన్‌స్పెక్టర్ షీ టీమ్స్, వరంగల్ కమిషనరేట్..



నగరంలో నలువైపులా షీటీమ్స్ నిఘా ఉంది. తప్పు చేస్తే తప్పించుకోలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. షీ టీమ్స్ పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిలను పట్టుకుంటున్నాం. కౌన్సెలింగ్ ఇస్తు న్నాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తున్నాం. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లను పట్టించుకోవద్దు. మహిళలు, యువతులు , విద్యార్థినులు సమస్య ఉంటే 87126 85257కు ఫిర్యాదు చేయవచ్చు.

నేటి నుంచి నేషనల్ లెవల్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్

సంగెం, మే 2 : బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో శుక్రవారం నుంచి శనివారం వరకు వాగ్ తరంగ్ లెక్సిక్రాఫ్ట్ నేషనల్ లెవల్ టెక్నికల్ కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాదరావులు చెప్పారు. గురువారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండురోజులపాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర టెక్నికల్ కార్యక్రమాల్లో అన్ని కళాశాల విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ రమేష్, మురళీ కృష్ణ, రాకేష్ దత్త పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

గీసుగొండ, మే 2: అనాథ పిల్లలకు ఆపద్భాంధవుల ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా మనుగొండ గ్రామానికి చెందిన అనాథ పిల్లలు ఎర్రల స్వప్న, ఏలేంద్ర, శ్రీనులకు నిత్యావసర వస్తువులతో పాటు ఒక్కొక్కరికి 25కిలోల బియ్యాన్ని గురువారం అందచేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కర్ణకంటి రామ్మూర్తి మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా రూ. 40 లక్షలతో 4000 మంది అనాథ, నిరుపేద కుటుంబాలను ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్, చార్టెడ్ అకౌంటెంట్ అరవింద్ సహకారంతో ఆదుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమరాజు, రజిత, మాదాసి పద్మ, రాంబాబు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఉషాదయాల్

సంగెం, మే 2: మండలంలోని పల్లారుగూడ, మొండ్రాయి, ఎలుగూరు రంగంపేట, తిమ్మాపురం గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ వేసవి దుక్కులను దున్నుకోవాలని, పండ్ల తోటలలో గుంటలు తీసి ఎండకు ఎండనివ్వాలన్నారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రనత కన్సల్టెంట్ పి.సారంగం, టెక్నికల్ వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి యాకయ్య పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలి :చల్లా



గాడెపల్లిలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

సంగెం, మే 2 : మోసపూరిత వాగ్దానాలతో మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. బొల్లికుంట, గాడెపల్లి, దూపకుంట, వసంతాపూర్, స్తంభంపల్లి, ఆదర్శనగర్ గేటర్ విలీన గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాలుగు నెలల కాలంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం కక్షపూరిత వైఖరి,నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో మోసం చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తోడు దొంగలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్దె బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, నాయకులు కత్తెరపల్లి దామోదర్, తుమ్మ సాగర్‌రెడ్డి, సోల్తి భూమాతరామస్వామి, తరలగల ప్రసాద్, ఊరుగొండ కుమార్, బి.బాబురావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రావీణ్య, సీపీ

వరంగల్ కలెక్టరేట్, మే 2: లోక్‌సభ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అభ్యర్థులందరినీ ఒకే తరహాలో చూడాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఆదేశించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి వ్యాస్ పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ఎవరిపట్ల పక్షపాతంతో వ్యవహరించరాదన్నారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు లేకుండా అప్రమత్తంగా నిర్వహించాలని ఆదేశించారు. అదనపు బ్యాటిల్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, వందశాతం ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులు కల్పించి, డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా పటిష్ఠమైన నిఘా పెట్టాలని సూచించారు. వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 65శాతం వరకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలిన ఓటర్లకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తూ డబ్బు, మద్యం ప్రభావం లేకుండా, తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్బీర్ చంద్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పన పూర్తయినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, పోలీస్ పరిశీలకులు నవీన్ సైని, వ్యయ పరిశీలకులు ఏ.దిలీబన్, ధీరజ్ సింగా, డీఆర్‌ఓ శ్రీనివాస్, డీసీపీ అబ్దుల్ బారీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేసింది నరేందరే..

కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రకుమార్

వరంగల్ సిటీ, మే 2: కాంగ్రెస్ పార్టీపై, కొండా సురేఖ మురళీధర్ రావుపై అభిమానంతో కాంగ్రెస్‌లో చేరామని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. గురువారం ఓసిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్పొరేటర్లను కొండా దంపతులు భయభ్రాంతులకు గురిచేసి కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసి, పైసలు ఇచ్చి ఇతర పార్టీల కార్పొరేటర్లు, నాయకులను కొనుక్కునే అలవాటు నరేందర్‌దేనని విమర్శించారు. గ డ్డం యుగేందర్, బండి కుమారస్వామి, ట్రిబుల్‌ఎక్స్ సుధాకర్, భారత్‌మెస్ నిర్వాహకులను, కత్తెరశాల వేణు, దామోదర్ యాదవ్, దిడ్డి నరేందర్ లాంటి ఎంతోమందిపై ఆయన అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు.

జర్నలిస్టులనూ మోసం చేశారు...

సామాన్యుడిగా ఉన్న నరేందర్‌ను ఈ స్థాయికి తీసుకురావడానికి జర్నలిస్టులు ఎంతో ఉపయోగపడ్డారని, అలాంటి జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఆశపెట్టి ఆగం చేసిన చరిత్ర ఆయనదని గుండేటి ఆరోపించారు. జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వకముందే ఇచ్చినట్లు గోడలపై రాయించుకున్న చరిత్ర ఆయనదని ఆరోపించారు. సమావేశంలో కార్పొరేటర్లు ముష్కమల్ల సుధాకర్, పోషాల పద్మ, బస్వరాజు కుమార్, చింతాకుల అనిల్, కావేటి కవిత, బైరబోయిన ఉమ, రామ తేజస్వినీ, సురేష్ జోషి, బాలిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ వికలాంగుల రాష్ట్ర చైర్మన్ వీరయ్య



కాంగ్రెస్ గెలుపు కోరుతూ ఓసిటీ మేయిన్ రోడ్‌పై ర్యాలీగా వెళుతున్న వికలాంగులు

వరంగల్ సిటీ, మే 2: వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, మొదటగా పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ గురువారం నగరంలో వికలాంగుల వాహనర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసిటీలో అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకగా కలిసి వికలాంగులందరూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం, కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఓసిటీ నుంచి బయలుదేరుతూ వీరయ్య విలేకరులతో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వికలాంగులకు మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో వికలాంగుల కోసం ఆరు అంశాలను చేర్చిందని వివరించారు. వికలాంగుల పై వివక్షను తొలగించడానికి ఆర్టికల్ 15,16 సవరించి అదనపు అంశాలను చేర్చుతామని చెప్పారని తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లను కల్పించిన మాదిరిగానే దేశ వ్యాప్తంగా కల్పిస్తామన్నారు. అంగవైకల్యం ఉన్న విద్యార్థులకు మెరుగైనవిద్యను, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రత్యేక విద్యను అందించడం కోసం రీసెర్చ్ ఇనిస్టిట్యూటులు ప్రారంభించి విద్యను మెరుగు పరుస్తామని అందులో చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎండి. అజీమ్, ప్రధాన కార్యదర్శి గై సతీష్, కోశాధికారి బత్తిని రాజు, అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల సురేష్, దూడల శ్రీనివాస్, కీర్తీ , రాజు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, మే 2: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో కౌసల్యదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు ఈనెల 4న మీసేవా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి స్లాట్ బుక్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మే నెలకు సంబంధించిన సదరం క్యాంప్‌లను ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో ఈనెల 8, 9, 10, 14, 20, 21, 22 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొ న్నారు. క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.దిలీబన్, ధీరజ్ సింగా

వరంగల్ కలెక్టరేట్, మే 2: అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు విధిగా అందజేయాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.దిలీబన్, ధీరజ్ సింఘా స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఇప్పటివరకు నిర్వహించిన వ్యయ సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. బరిలో ఉన్న 42 మంది అభ్యర్థుల్లో 32 మంది మాత్రమే వారు నిర్వహిస్తున్న ఎన్నికల ఖర్చుల సంబంధిత రిజిస్టర్లు సమర్పించగా పరిశీలించడం జరిగిందన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 77 ప్రకారం అభ్యర్థులు విధిగా హాజరై ఖర్చులు పరిశీలించుకోవాలని, హాజరు కాని పది మంది అభ్యర్థులకు నోటీసులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 6, 10 తేదీల్లో రెండు, మూడో దశ పరిశీలనకు ఎన్నికల ఖర్చుల రిజిస్టర్లు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలన నోడల్ అధికారి రామిరెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, 7 అసెంబ్లీ సెగ్మెంట్లలోని సహాయ వ్యయ అధికారులు, పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు.

'కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి'



దేశాయిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ శ్రేణులు

పోచమ్మమైదాన్, మే 2: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ సేవాదళ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి మోహన్‌గౌడ్ ఓటర్లను కోరారు. దేశాయిపేటలో గురువారం కాంగ్రెస్ సేవాదళ్ శ్రేణులు కడియం కావ్య గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవా దళ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, అరుణా, కర్ణ అశోక్, దేవులపల్లి మోహన్ పాల్గొన్నారు.

● కావ్యకు ఎఫ్‌బీపీ మద్దతు

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోటీ చెయ్యని నియోజకవర్గాలలో ఇండియా కూటమి అభ్యర్థులను బలపర్చాలనే లక్ష్యంతో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీంనవీద్ తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా నేతలు గురువారం హన్మకొండలో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను మర్యాద పూర్వకంగా కలిసి, తమ మద్దతు తెలిపారు. కావ్యను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రోహిత్, ప్రవీణ్, పూర్ణ, సయ్యద్, మొహేన్, ఖాజామియా, యూసఫ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తాం: రేవూరి

గీసుగొండ, మే 2: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆగ స్టు 15 వరకు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని వరంగల్ పార్లమెంటు ఇన్ చార్జీ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండ లంలోని ఎలుకుర్తి, ఆరెపల్లి, ఊకల్, మరియపురం, కొనా యిమాకులలో నిర్వహి ంచిన బూత్‌స్థాయి కమిటీల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పాంచ్‌న్యాయ్‌లోని 25 పథకాలను బూత్ కమిటీ బాధ్యులు ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జావేద్, యూత్ మండల అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, మండల కో ఆప్షన్ సభ్యుడు రహీంపాష పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌తో సహా ముగ్గురిపై కేసు నమోదు

కరీమాబాద్, మే2: నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతానికి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్‌తోపాటు మరో ముగ్గురిపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఉర్సు గుట్ట ప్రాంతంలో లక్కం సురేష్‌కు సంబంధించిన 466గజాల స్థలంలో ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత నెల 29న మధ్యాహ్నం అక్రమంగా నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఇంటి పనులు ఆపాలని దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారని బాధితుడు లక్కం సురేష్ చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. దీంతో కబ్జాకు ప్రయత్నించిన మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్‌తోపాటు దాడికి పాల్పడిన బుడిగ చిట్టిబాబు, మినుముల భాస్కర్, పసుల రాజ్‌కుమార్‌లపై పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి: మంత్రి



మంత్రి సురేఖతో వికలాంగుల ఫోరం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 2: నగరంలోని ఓసిటీ క్యాంపు కార్యాలయంలో గురువారం అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించిన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, కాంగ్రెస్ అభ్యర్థి కావ్య గెలుపునకు పాటుపడాలని పేర్కొన్నారు.

● కావ్యకు మద్దతుగా దివ్యాంగులు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్‌కు చెందిన దివ్యాంగుల బాధ్యులు గురువారం ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ గెలుపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తామని మంత్రికి తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

నెక్కొండ, మే 2 : నెక్కొండ, నర్సంపేట ప్రాంతాల్లోని చిరు షాపుల్లో దొంగతనాలకు పాల్పడిన పర్వతగిరి మండలం దౌలత్‌నగర్‌కు శివారు టుక్యాతండాకు చెందిన బానోతు దస్రును అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. గత నెలలో నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో పండ్ల షాపులో, నర్సంపేటలోని అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ షాపులో చోరీకి పాల్పడిన కేసులో దస్రు నిందితుడన్నారు. నెక్కొండ పోలీసు స్టేషన్‌లో గతంలో ఇతనిపై పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

రారెత్తిస్తున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

కలిగించే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడదెబ్బతో మృతి చెందుతున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. అత్యవసరమైతే తప్ప ఎండలో వెళ్లకూడదని, వేడి తీవ్రత తగ్గిన తర్వాత వెళితే మేలని వైద్యులు చెబుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. రాత్రి ఉక్కపోత, పగటి పూట తీవ్రమైన వేడితో జనం ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారు అల్లాడిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరి కొద్దిరోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రెడ్ అలర్ట్

ఉష్ణోగ్రత 46 డిగ్రీలకుపైగా చేరడంతో రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు చేరాయి. వేసవిలో ఎండ తీవ్రత 45 డిగ్రీలు నమోదైతే ఆప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు ఎండపూట బయటకు వెళితే వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ హెచ్చరిస్తున్నారు. 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్‌లోపు నమోదైతే ఆయా ప్రాంతాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లుగా వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. రాబోయేరోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే సూచన ఇది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువల్ల బయటకు వెళ్లొద్దనేదానికి ఇది సూచిక. 35 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రత ఉంటే ఎలాంటి హెచ్చరికలు ఉండవు. దీనిని గ్రీన్‌జోన్‌గా పరిగణిస్తారు. ఈ ఎండ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.



పోలింగ్‌కు ఎండ దెబ్బ

'మహబూబాబాద్' పోలింగ్ సమయం పెంపు

మహబూబాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయాన్ని మరోగంట పొడిగిస్తూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని మహబూబాబాద్ కలెక్టర్, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. గత ఎన్నికల నియమావళి ప్రకారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఎన్నికల ప్రక్రియను వేసవి ఎండతీవ్రత ఉన్న నేపథ్యంలో గంట సమయాన్ని పెంచారని, ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, ఏజెన్సీ ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో ప్రకటించిన విధంగా ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

పేదలకు మొండిచేయి చూపిన మోదీ పాలన


మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

వర్ధన్నపేట రూరల్, మే 2 : దేశంలో పదేండ్ల పాటు పాలన చేసిన బీజేపీ ప్రభుత్వం పేద వర్గాలకు మొండిచేయి చూపించిందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాల మోదీ పాలనలో 80 కోట్ల ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నానని చెపుతున్నారని, అంటే 80 కోట్ల మంది నిరుపేదలు ఇంకా అలాగే మిగిలిపోయారని విమర్శించారు. ప్రపంచంలో అత్యంత ధనవంతులైన కుబేరులు దేశంలో ఉన్నారని, కానీ 80 కోట్ల ప్రజలు ఆర్థిక సంక్షోభంలో చిక్కిపోయారని గుర్తుచేశారు. 30 కోట్ల యువకులు నిరుద్యోగులుగా ఉన్నారని, దీనికి బీజేపీ విధానాలే కారణమన్నారు. దేశంలో 450 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కేంద్ర నిధులు లేక, పరిశోధన నిధులు లేక విద్యార్థులకు హాస్టల్‌లో సౌకర్యాలు లేక నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. ఇదే అనువుగా వేలాది కార్పొరేట్ కళాశాలలు పేద ప్రజలు రక్తాన్ని పీడించుకుని తింటుంటే కేంద్రం కండ్లప్పగించి చూస్తోందన్నారు. గత పది సంవత్సరాల్లో 8లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 750మంది పేద రైతులు డిల్లీ చుట్టూ చేసిన ధర్నాల్లో మరణిస్తే బీజేపీ రైతుల పక్షాన నిలవలేకపోయిందని ఆరోపించారు. అందుకే దేశంలో, రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లేశ్వరి పూలే ఆశయ సాధన రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మంద వీరస్వామి, దయాల సుధాకర్, పలువురు లెక్చరర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు స్పందించాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 2 : ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తహసీల్దార్, ఆర్డీవో స్పందించాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయదీప్, దళిత ప్రజాసంఘాల జేఏసీ కో-కన్వీనర్, పూలే వారసుల రాజ్యం అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, జనపోరాట సమితి రాష్ట్ర బాధ్యుడు పంజాల రాజుగౌడ్, దళిత ప్రజాసంఘాల జేఏసీ కో-కన్వీనర్ గుంటి వీరప్రకాశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ భూములను సర్వే చేసి బోర్డులను ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని 13వ వార్డులోని తన నివాస గృహాన్ని, ఖాళీస్థలాన్ని దొడ్డా మోహన్‌రావు ప్రభుత్వానికి గతంలో అప్పగించారనిపేర్కొన్నారు. కొంతమంది కుట్రదారులు సుమారు రెండున్నర కోట్ల విలువైన భవనము, ఖాళీ స్థలాన్ని ఆ క్రమంగా ఆక్రమించుకొని కూల్చివేసి అక్రమ నిర్మాణాలు చేయడానికి యత్నిస్తున్నారని తహసీల్దార్, ఆర్డీవో స్పందించి విచారణ జరిపి ఆ భవనాన్ని ప్రభుత్వ పరంగా స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు. ఆక్రమణకు గురవుతున్న భవనం, ఖాళీస్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకునే విధంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులను ఆదేశించాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రీరామోజు మురళి, గుడికందుల సంతోష్, శ్రీరామోజు కుమారస్వామి, నాగరాజు, రవి, రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలిపించాలి


స్వామిరావుపల్లిలో బీజేపీలో చేరుతున్న పలువురు

దుగ్గొండి, మే 2 : మహబూబాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సీతారాం నాయక్‌ను ఎన్నికల్లో గెలిపించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని స్వామిరావుపల్లి గ్రామంలో వివిధ పార్టీల కు చెందిన పలువురు గురువారం బీజేపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో పీఎం మోదీ చేసిన సంక్షేమ ఫలాల కారణంగా మళ్లీ బీజేపీ పాలనను ప్రజలు కోరుకోవడం జరుగుతుందని పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. అనంతరం మైసంపల్లి, ముద్దునూర్, గుడ్డెల్లులపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, ఒడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, దళిత మోర్చా జిల్లా కో-కన్వీనర్ కూనమల్ల పృధ్వీరాజ్, మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్, మణీష్‌గౌడ్, ఈర సందీప్, అచ్చ దయాకర్, అముదాల రమేశ్, కొంకిస విగ్నేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- చెన్నారావుపేట : దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీని మళ్లీ గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకుడు వనపర్తి మల్లయ్య అన్నారు. గురువారం మండలంలో శంకరంతండాలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మరాదన్నారు. మరోమారు బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో హంస రామకృష్ణ, శేఖర్, రాజు పాల్గొన్నారు.

కోట్ల నిధులు మరుగుదొడ్ల పాలు..!


మొండిగోడలతో దర్శనమిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్


వ్యర్థాలతో అధ్వానంగా మార్కెట్‌లోని ప్లాట్ ఫాంలు

వర్ధన్నపేట రూరల్, మే 2 : రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నచందంగా, ప్రజల సొమ్మును మరుగుదొడ్ల పాలు చేస్తున్నారు ప్రజాప్రతినిధులు, అధికారులు. ప్రజల అవస రాల నిమిత్తం నిర్మాణంచేస్తున్న కొన్ని కట్టడాలు అసంపూర్తిగా వదిలేస్తుండగా, మరికొన్ని వాటిని ప్రారంభించేందుకు కూడా ముందుకు రావడంలేదు. తద్వారా ప్రభుత్వ సొమ్ము నిర్వీ ర్యమవుతోంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో రూ2 కోట్లతో నిర్మాణం చేపట్టిన సమీ కృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ భవననిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.ఇక సులభ్ కాంప్లెక్స్‌ల పేరిట మునిసిపాలిటీలోని అంబేడ్కర్ సెంటర్‌వద్ద, కొత్త బస్టాండ్ ప్రాంగణంలో నిర్మాణాలు చేపట్టి వాటి నిర్వ హణ పట్టించుకోవడంలేదు. వాటిల్లో కమర్షియల్ రూములను నిర్మాణంచేసి ప్రారంభించకుండా వదిలేసారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

నియోజకవర్గ కేంద్రంలో గత సంవత్సరం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వర్ధన్నపేటకు తలమానికంగా ఉండే డాబ్ బాంగ్లా (ప్రభుత్వ అతిథి గృహం) కట్టడాన్ని కూల్చివేసింది. ఇట్టి స్థలంలో ముందుగా సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మాణం చేసి, తర్వాత ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించి పనులు చేపట్టింది. అసంపూర్తిగా ఉన్న మార్కెట్ సముదాయం మొండి గోడలతో దర్శనమిస్తోంది. కూరగాయాలు, మటన్, చికెన్, చేపలు అమ్ముకునేందుకు ప్లాట్ ఫాంలను సైతం ఏర్పాటు చేశారు. కానీ పైకప్పును నిర్మించకుండా వదిలేయడంతో ఇప్పుడు మార్కెట్ సముదాయం అసాంఘి క కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ముఖ్యంగా ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేసిన చోట స్థానికులు మరుగు దొడ్డిలా వాడుతూ దుర్వాసన వచ్చేలా చేస్తున్నారు. ఇక రాత్రి వేళల్లో సైతం మద్యం సేవించడం, ఇతర అసాంఘిక పనులకు వాడుతు న్నారు. తండాకు చెందిన కొంత మంది వ్యక్తులు గుడుంబాను తీసుకుని వచ్చి మార్కెట్ కేంద్రంగా విక్రయాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వృధాగా కమర్షియల్ రూమ్స్...

మునిసిపాలిటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు ఎంతో ఆర్భాటంగా వర్ధన్నపేటలో సులభ్ కాంప్లెక్స్‌లు ఉండాలని నిశ్చయించి వాటిని రూ. 36 లక్షలతో రెండు చోట్ల నిర్మాణం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని నిర్మాణం చేసినప్పటికీ, వాటినిర్వహణలో అధికారులు విఫలమయ్యారు. దీనికి తోడుగా సులభ్ కాంప్లెక్స్ భవనానికి మరో వైపు కమర్షియల్ రూములను నిర్మాణం చేశారు. రెండు చోట్ల రెండేసీ రూములను ఏర్పాటు చేయగా వాటిని అద్దెకు ఇవ్వకుండా జాప్యంచేస్తున్నారు. గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా వేలం వేసి రూములను అద్దెకు ఇవ్వాలని దరఖాస్తులు సైతంస్వీకరించారు. కానీ వాటికి ప్రజాప్రతినిధుల నుండి ఒత్తిడిలు పెరగడంతో ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఇక బస్టాండ్ ఆవరణలో నిర్మాణం చేసిన రూముల విషయంలో ఆర్టీసీ అధికారులు మెలిక పెట్టినట్లుగా తెలుస్తోంది. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో నిర్మాణం చేసి వాటి లాభాలను మునిసిపాలిటీ గడించడం సరికాదని చెప్పడంతో రూములు వృధాగా ఉండిపోయాయి.

ప్రకటనల పై ఉదాసీనత...


ఆవరణలో మూత్ర విసర్జన చేస్తున్న ఓ యువకుడు

ప్రజల అవసరాలు తీర్చడానికి పన్నులతో పాటు పురపాలక సంఘం వివిధ ఆదాయ మార్గాలను ఎంచుకోవాలి. వీటి లో ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో ముఖ్య మైనది. దీనిపై వర్ధన్నపేట మునిసిపాలిటీ అధికారులు ప్రకటనల పట్ల ఉదాసీన తను ప్రదర్శిస్తున్నారు.మునిసిపాలిటీ పరిధి లో దాదాపు 6 హోర్డింగులు ఉండగా వాటి నిర్వహణ లోపంతో ప్రకటనలకు నోచు కోవడం లేదు. దీనికి తోడు పట్టణంలో ఆయా వ్యాపార, విద్యాసంస్థలు ప్రచారానికి ప్రకటనలు జారీ చేస్తుంటాయి. వీటిలో ప్రతి ప్రకటనకు అనుమతి తప్పసరిగా తీసుకోవాలి.

రద్దీ ప్రాంతాల్లో ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఈ ప్రచార బోర్డులు ఏర్పాటు చేస్తారు. వీటిని ఇష్టారీతిన సైతం ఏర్పాటు చేయడానికి వీలు లేదు. పురపాలక చట్టం-2019ని అనుసరించి 15 రకాల ప్రకటనలకు అనుమతి అవసరం అవుతుంది. కొన్ని చోట్ల ఇష్టానుసారంగా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మునిసిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. ఇక హోర్డింగుల అనుమతుల్లో సైతం అధికారులు జాప్యం చేయడంతో ఎవరు ముందుకు రావడం లేదని సమాచారం.

మారని వర్ధన్నపేట మునిసిపాలిటీ తీరు...


సులభ్ కాంప్లెక్స్‌లో వృథాగా ఉన్న దుకాణ సముదాయాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వర్ధన్నపేట మునిసిపాలిటీ తీరు ఆగమ్య గోచరంగా మారింది. ఆయా వార్డుల కౌన్సిలర్లు సైతం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. అధికారులను ఎన్నిసార్లు హెచ్చ రించి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పి నా వారి తీరులో ఎలాంటి మార్పు ఉండడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, పలు కాలనీలను ఊడ్చ కుండా వదిలేయడం, చెత్తను తీసుకెళ్ల డంలో జాప్యం చేయడంతో పాటు నీటి సమ స్యలు సైతం అలానే ఉండిపోయాయి. ప్రధాన రహదా రి పై వచ్చే చెత్త ట్రాక్టర్ సైతం సరిగ్గా రావడం లేదని వాణిజ్య వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకేరు వాగు సమీపంలోని ప్రధాన కాలువలో చెట్లను వేసి చాలా రోజులవుతున్న పట్టించుకోవడం లేదు. ఓ పక్క పన్నులు వసూలు చేస్తూనే.. మరో పక్క మునిసిపాలిటీ ఖజానా ఖాళీగా ఉందని చెపుతూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్కెట్


కొండేటి శ్రీనివాస్, వర్ధన్నపేట

గత సంవత్సరం ప్రారంభమైన సమీకృత మార్కెట్ పనులు అసంపూ ర్తిగా నిలిచిపోయాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు, మలవిసర్జన చేసేందుకు అడ్డాగా మారింది. కమర్షియల్ రూములు సైతం నిరుద్యోగ యువతకు అందిస్తే ఉపాధి కల్పించినట్లుగా ఉంటుంది. మునిసిపాలిటీ పాలకవర్గం, అధికారులు వీటి పై దృష్టి సారించి, పనులు పూర్తి చేసి వాడుకలోకి తేవాలి.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రాజుగౌడ్


రాజుగౌడ్

నెక్కొండ, మే 2 : నెక్కొండ మండలం సూరుపల్లి,లింగగిరి క్రాస్‌రోడ్డు చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గడ్డం రాజుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు సింగారపు భాస్కర్ గురువారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మేడబోయిన మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా వన్నల సతీష్, కోశాధికారిగా అణువుల సురేష్, కార్యవర్గ సభ్యులుగా మందుల కవిరాజ్, కొంకాల రవికుమార్, మంద వేణులను ఎన్నుకున్నారు.

వీధి కుక్కల పట్టివేత

పర్వతగిరి, మే 2 : మండలంలోని అన్నారంషరీఫ్‌లో వీధికుక్కల బెడద విపరీతంగా ఉండడంతో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో పాక శ్రీనివాసులు కుక్కలను పట్టించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సభ తీర్మానం మేరకు గ్రామంలోని వీధి కుక్కలను పట్టించి సమీప అడవుల్లో వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోహినుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వర్ధన్నపేట రూరల్, మే 2 : తెలంగాణ రాష్ట్ర కర్షకుల కోసం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ అని, రాబోయే రోజుల్లో అన్నదాతలకు అండగా కాంగ్రెస్ పార్టీనే నిలుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. గురువారం హనుమకొండలోని సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని మడికొండ ప్రాంతానికి చెందిన 46వ డివిజన్ ఆదర్శ కాలనీ నుంచి 100మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, హసన్‌పర్తి మండలం నుంచి వైస్ ఎంపీపీ బండ రత్నాకర్, మాజీ సర్పంచ్ మెట్టు కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ రామంచ సాయిలుతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం నగరంలోని 3, 14వ డివిజన్‌కు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ బృందం కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపెల్లి తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వస్కుల శంకర్, డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, సయ్యద్ ఇంతియాజ్, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్

వరంగల్ కలెక్టరేట్, మే 2 : లోక్‌సభ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అభ్యర్థులందరినీ ఒకే తరహాలో చూడాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఆదేశించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి వ్యాస్ పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ఎవరిపట్ల పక్షపాతంతో వ్యవహరించరాదన్నారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు లేకుండా అప్రమత్తంగా నిర్వహించాలని ఆదేశించారు. అదనపు బ్యాటెల్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, వందశాతం ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులు కల్పించి, డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని సూచించారు.

వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 65శాతం వరకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలిన ఓటర్లకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తూ డబ్బు, మద్యం ప్రభావం లేకుండా, తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతుల కల్పన పూర్తయినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, పోలీస్ పరిశీలకులు నవీన్ సైని, వ్యయ పరిశీలకులు ఏ.దిలీబన్, ధీరజ్ సింఘా, డీఆర్ఓ శ్రీనివాస్, డీసీపీ అబ్దుల్ బారీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదరంను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, మే 2 : దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సదరం క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో కౌసల్యదేవి గురువారం ఒక ప్ర కటనలో తెలిపారు. సదరం క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు ఈ నెల 4న మీ సేవా కేంద్రాల్లో ఉదయం 11గంటల నుంచి స్లాట్ బుక్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.మే నెలకు సంబంధించిన సదరం క్యాంప్‌లను ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో ఈనెల 8, 9, 10, 14, 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. సదరం క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

మణుగూరు, మే 2 : లోక్‌సభ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. గురువారం మణుగూరు పట్టణంలో సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సాగునీరందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించి పులుసుబొంత, వట్టివాగు ప్రాజెక్టలను పూర్తి చేస్తానని,మణుగూరులోని రేగులగండి చెరువు అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. నాడు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి నది తీరంపై లిఫ్ట్ ఇరిగేషన్‌ల నిర్మాణానికి కృషిచేసి నిర్మించింది తానేనని పేర్కొన్నారు. జరగబోయే ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మిత్రపక్ష నాయకులు, కార్యకర్తలను, కాంగ్రెస్ శ్రేణులను కోరారు.

బలరాంనాయక్‌ను గెలిపించాలి : పాయం

మహబూబబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీని పార్లమెంట్ ఎన్నికల్లో అందించాలన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసి పినపాక నియోజకవర్గ అభివృద్ధికి బలరాంనాయక్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం మోహన్‌రావు, వాసిరెడ్డి చలపతిరావు, పి.రాజు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు

వరంగల్ కలెక్టరేట్, మే 2 : అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు విధిగా అందజేయాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.దిలీబన్, ధీరజ్ సింఘా స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఇప్పటివరకు నిర్వహించిన వ్యయ సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. బరిలో ఉన్న 42 మంది అభ్యర్థుల్లో 32 మంది మాత్రమే వారు నిర్వహిస్తున్న ఎన్నికల ఖర్చుల సంబంధిత రిజిస్టర్లు సమర్పించగా పరిశీలించడం జరిగిందన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 77 ప్రకారం అభ్యర్థులు విధిగా హాజరై ఖర్చులు పరిశీలించుకోవాలని, హాజరుకాని పది మంది అభ్యర్థులకు నోటీసులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 6, 10 తేదీల్లో రెండు, మూడో దశ పరిశీలనకు ఎన్నికల ఖర్చుల రిజిస్టర్లు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలన నోడల్ అధికారి రామిరెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, 7 అసెంబ్లీ సెగ్మెంట్లలోని సహాయ వ్యయ అధికారులు, పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

కలిగించే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడదెబ్బతో మృతి చెందుతున్నవారి సంఖ్య కూడా పెరగుతోంది. అత్యవసరమైతే తప్ప ఎండలో వెళ్లకూడదని, వేడి తీవ్రత తగ్గిన తర్వాత వెళితే మేలని వైద్యులు చెబుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. రాత్రి ఉక్కపోత, పగటి పూట తీవ్రమైన వేడితో జనం ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారు అల్లాడిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరికొద్దిరోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రెడ్ అలర్ట్

ఉష్ణోగ్రత 46 డిగ్రీలకుపైగా చేరడంతో రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు చేరాయి.వేసవిలో ఎండ తీవ్రత 45 డిగ్రీలు నమోదైతే ఆప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు ఎండపూట బయటకు వెళితే వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ హెచ్చరిస్తున్నారు. 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్‌లోపు నమోదైతే ఆయా ప్రాంతాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లుగా వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. రాబోయేరోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే సూచన ఇది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువల్ల బయటకు వెళ్లొద్దనేదానికి ఇది సూచిక. 35 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రత ఉంటే ఎలాంటి హెచ్చరికలు ఉండవు. దీనిని గ్రీన్‌జోన్‌గా పరిగణిస్తారు. ఈ ఎండ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం లేదు


మట్టితట్ట మోస్తున్న కవిత

ఖానాపురం, మే 2 : నాలుగు నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకంలేదని బీఆర్ఎస్ పార్టీ మహ బూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బుధరావుపేట ఈదుల చెరువులో ఉపాధి హామీ పనుల్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పాల్గొని ఉపాధి కూలీలతో మాట్లాడారు. గునపం పట్టి చెరువులో మట్టితవ్వారు. కూలీలతో కలిసి మట్టి తట్టమోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకాని వాగ్దానాలను నమ్మి ఓట్లేసిన ప్రజలు తాము మోసపోయామని గ్రహించారన్నారు. వారి పాలన తీరుపై ప్రజలు అసంతృప్తితోనే ఉన్నారన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని, ప్రజలు మరోమారు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బయటికి రావడంతో ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని, కేసీఆర్ తెలంగాణ హక్కులను కాపాడుతారనే నమ్మకం ప్రజల్లో నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం గోదావరి నదిపై కట్టిన ప్రాజెక్టలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కవితను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతారని, కవిత కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, ఎంపీటీసీ సుభాన్‌బీమౌలాన, బాలునాయక్, లాదినేని ఎల్లయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు.. గుడుంబా స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గుడుంబా, దిచక్ర వాహనాలు

నెక్కొండ, మే 2 : మండలంలోని చెరువుముందరితండా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గుడుంబా తరలిస్తున్న రెండు దిచక్ర వాహనాలు, 35 లీటర్ల గుడుంబా స్వాధీన పర్చుకున్నట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి గురువారం తెలిపారు. చెరువుముందరితండా గ్రామం నుంచి వరంగల్‌కు దిచక్ర వాహనాలపై గుడుంబాను తరలిస్తుండగా సూరుపల్లి వద్ద వాహనాలను ఎక్సైజ్ పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండటంతో పోలీసులను చూసిన గుడుంబా రవాణదారులు చెరువుముందరితండా గ్రామానికి చెందిన బానోతు హరి, బానోతు సరియా వాహనాలను, గుడుంబాను వదలి పారిపోయినట్లు చెప్పారు. ఇరువురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

నెక్కొండ, మే 2 : నెక్కొండ, నర్సంపేట ప్రాంతాల్లోని చిరు షాపుల్లో దొంగతనాలకు పాల్పడిన పర్వతగిరి మండలం దౌలత్‌నగర్‌కు శివారు టుక్యాతండాకు చెందిన బానోతు దస్రును అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. గత నెలలో నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో పండ్ల షాపులో, నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లోని ఓ షాపులో చోరీకి పాల్పడిన కేసులో దస్రు నిందితుడన్నారు. నెక్కొండ పోలీసు స్టేషన్‌లో గతంలో ఇతనిపై పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

కడియం కావ్య గెలుపు ఖాయం


ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి, మే 2 : వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు తథ్యమని గ్రామపార్టీ అధ్యక్షుడు పెండ్లి మొగిళి అన్నారు. గురువారం మండలంలోని మహబూబ్ నగర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్‌కు కేంద్రంలో కూడా అధికారం ఇస్తే రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ పెళ్లి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ చిక్కొండ రజిత వీరస్వామి, ఎలకల కొమురయ్య, ఇల్లందుల పగిడి, గారె సుధాకర్, చదరపు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

దుగ్గొండి, మే 2 : వేసవి కాల ఉచిత రెజ్లింగ్ శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అధికారి టీవీఎల్ సత్యవాణి గురువారం వెల్లడించారు. మే నెల 2 నుంచి 31 వరకు రెజ్లింగ్ సమ్మర్ శిక్షణ క్యాంపును దుగ్గొండిలోని ఆదర్శవాణి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు, ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 5. 30 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని క్యాంపు వివరాలకై ఇన్‌చార్జ్ ఇటికాల దేవేందర్ ఫోన్ నంబరు 7673986515ను సంప్రదించాలని సత్యవాణి పిలుపు పేర్కొన్నారు.